## అభిషేకాలు.. పూజలు



వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చిక్కడపల్లి: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శనివారం ఆలయాల్లో అభిషేకాలు.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీ భువనేశ్వరీ దేవి అమ్మవారికి, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలోని శ్రీ క్షీరాలింగేశ్వరస్వామికి శనివారం ఉదయం, సాయంత్రం ఏకవార రుద్రాభిషేకాలు, మహన్యాస రుద్రాభిషేకం, ఆకాశదీప పూజ, కార్తీక పురాణ ప్రవచనం, భక్తులతో దీపారాధన, ప్రదోషపూజ, బిల్వార్చన, నివేదన, హారతి, మహామంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయాల ఈవోలు ఎం.దేవనాథం, పి.లక్ష్మారెడ్డి, అర్చకులు బుగ్గ లక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రి, ఈ.కాశీనాథశర్మ, భవనందశర్మ, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో అభిషేకం..

## నేడు కార్తీక సమారాధన

నల్లకుంట: అఖిల బ్రాహ్మణ సమాజాభివృద్ధి సంస్థ (ఏబీసీడీసీ), విద్యా వికాస్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో ఈనెల 10న (నేడు) క్రోధి నామ సంవత్సర కార్తీక సమారాధన నిర్వహించనున్నట్లు ఏబీసీడీసీ అధ్యక్షుడు టీ విశ్వనాథం తెలిపారు. విద్యా వికాస్ ట్రస్ట్ కార్యదర్శి కేవీఆర్‌కే. సుబ్రహ్మణ్యం ఏబీసీడీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు పీఎస్.మూర్తి తదితరులతో కలిసి శనివారం వివరాలు వెల్లడించారు.

న్యూ నల్లకుంటలోని కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ హాల్‌లో ఉదయం 6.30 గంటలకు సమారాధన ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 8 గంటలకు సత్యనారాయణ స్వామి వ్రతం, తులసీ, ధాత్రీ (ఉసిరి) సహిత లక్ష్మీ నారాయణ పూజ, దీపారాధన, అనంతరం కుంకుమ పూజలు, మంగళ గౌరీ పూజ, లలితా,విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ ఉంటుందని తెలిపారు. 10 గంటలకు ప్రతిభావంతులైన పేద బ్రాహ్మణ విద్యార్థులకు(ఎంపిక చేసిన వారికి) ఉపకార వేతనాలు అందిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం సహ పంక్తి భోజనాలు ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు సె: 9390646539, 9100414469, 9866154760 నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు. సమావేశంలో ఏబీసీడీసీ సంయుక్త కార్యదర్శులు జీ వినోద్ కుమార్, హరిప్రసాద్, జీ ఉషాసుందరి పాల్గొన్నారు.

## నేడు బహుమతుల ప్రదానం

చిక్కడపల్లి: సివిల్స్ లక్ష్యంగా పెట్టుకున్న గ్రామీణ ప్రాంత యువతీ, యువకులను ప్రోత్సహించాలన్నా ఉద్దేశంతో సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ, టైలర్ ఆర్గనైజేషన్‌ల సంయుక్తంగా నిర్వహించిన స్కాలర్‌షిప్ టెస్టు విజేతలకు ఈనెల 10న (నేడు) బహుమతులు ప్రదానం చేయనున్నట్లు సీఎస్‌బీ అకాడమీ నిర్వాహకురాలు బాలలత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 10 వేలకు పైగా యువతీయువకులు దరఖాస్తు చేసుకోగా సుమారు 4 వేల మందికి పైగా హాజరయ్యారని తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన 10 మంది అభ్యర్థులకు తమ అకాడమీలో ఉచితంగా సివిల్స్ కోచింగ్ ఇస్తామని, అలాగే టాప్ 200లో నిలిచిన వారికి ఉచితంగా సివిల్స్ మెటీరియల్స్‌ను అందిస్తామని పేర్కొన్నారు. గాంధీనగర్‌లో తమ అకాడమీలో సాయంత్రం 4.30 జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హాజరై బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు.

## డిసెంబర్ 1న మాలల సింహగర్జన



కాచిగూడ: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న జింఖాన గ్రౌండ్స్‌లో మాలల సింహగర్జన నిర్వహించనున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో చైర్మన్ గోపోజు రమేశ్ బాబు తెలిపారు. శనివారం నారాయణగూడలో ఆయన మాట్లాడుతూ సింహగర్జనను విజయవంతం చేసేందుకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో పర్యటిస్తూ సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే దేశానికే ఆదర్శం



సర్వేను పరిశీలిస్తున్న కుమారస్వామి

కాచిగూడ: తెలంగాణలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో బీసీ నేతలతో కలిసి సర్వే తీరును శనివారం పరిశీలించారు. అనంతరం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కూడా జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిద్వారా అన్ని వర్గాలకు ప్రభుత్వ ఫలాలు సమానంగా అందుతాయన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగం, సామాజిక న్యాయం, ప్రజలకు సమానంగా చేరినప్పుడే ప్రతి ఒక్కరికీ సమన్యాయం చేసిన వాళ్లమవుతామని పేర్కొన్నారు.

## రామకృష్ణ మఠానికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న బుచ్చిరాజు, సభ్యులు

కవాడిగూడ: లోయర్ ట్యాంక్ బండ్‌లోని శ్రీరామకృష్ణ మఠం ఆధ్వర్యంలో ఈ నెల 14న బాలల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అయితే అనాథ బాలలకు దుస్తులు అందజేసేందుకు హైదరాబాద్‌లో స్థిరపడ్డ ఆంధ్రప్రదేశ్ పెన్షన్‌దారుల సంఘం ఆధ్వర్యంలో రూ. 70249 చెక్కును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి టీఎంబీ బుచ్చిరాజు మాట్లాడుతూ.. యువతకు వ్యక్తిత్వ వికాసంతో పాటు పేదలను ఆదుకునేందుకు రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో మరిన్ని సేవలు చేయాలని వారు కోరారు.

## పైపులైన్ పనుల పరిశీలన

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని వాల్మీకినగర్ బస్తీలో రూ.3.50లక్షల వ్యయంతో చేపట్టిన సీవరేజ్ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, మొహమూద్, నర్సింహ, సాయికుమార్, ఆనంద్‌రావు, వాటర్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్, కాంట్రాక్టర్ మహేశ్, బస్తీ వాసులు రాములమ్మ, ప్రేమలత, శ్రీలత, జగదీశ్వరి పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్,అధికారులు

## త్వరలో ఉచిత హోమియోపతి వైద్య సేవలు



కాచిగూడ: మంత్రాలయ శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థస్వామి ఆశీర్వాదంతో త్వరలో బర్కత్‌పురలోని మఠంలోనూ ఉచిత హోమియోపతి వైద్యశాల, ఫిజియోథెరపీ సెంటర్, ఆధ్యాత్మిక గ్రంథాలయం ఏర్పాటు చేయనున్నట్లు మఠం మేనేజర్ కొండూరి సూర్య చంద్రశేఖర్ శర్మ తెలిపారు. శనివారం బర్కత్‌పురలోని మఠంలో ఆయన మాట్లాడుతూ కొండాపూర్‌కు చెందిన భక్తురాలు ఆర్. అనురాధ వాసుదేవరావు రూ.12 లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. పనులు పూర్తి కావచ్చాయని, కార్తీకమాసంలోనే ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. యువతకు ఉపయోగపడేలా ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను మఠంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 15వ తేదీన మఠంలో దీపోత్సవ వేడుకలు కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## వైభవంగా హనుమంతుడి పల్లకీ సేవ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: హిందూ ధర్మాన్ని కాపాడుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందని పద్మాకాలనీ శ్రీనివాస వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి టీ రితేశ్ కుమార్ అన్నారు. పద్మాకాలనీలో హనుమంతుడి పల్లకీ సేవను శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల నగరంలో కొంతమంది దుండగులు అమ్మవారు గుడిని పగులగొట్టడం లాంటి చర్యలకు పాల్పడుతున్నారని, ప్రతి హిందువు జాగృతి అయి ధర్మాన్ని కాపాడుకునేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మోహన్, సాయి, వసంత్, హర్షా, బంటీ, నవీన్, రూప, సుస్మిత, శ్రీలక్ష్మి, దీపికా తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ధర్మ పరిరక్షణకు స్వామీజీల కృషి



స్వాగతం పలుకుతున్న రమేశ్‌రాం, నేతలు

కవాడిగూడ: మఠ, పీఠాధిపతులు హిందూ ధర్మాన్ని దేశవ్యాప్తంగా ముందుకు తీసుకెళ్తూ.. సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షిస్తున్నారని ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఎం.రమేశ్‌రాం అన్నారు. శనివారం నగరానికి వచ్చిన కాశీ హల్దీపూర్ మఠం శ్రీవామనాశ్రమ స్వామీజీకి ఆయన ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైశ్య సంఘం నేతలు గంప మల్లేశం, గంప శ్రీనివాస్, చల్లా శివకుమార్, బబీ. రమేశ్, నాగభూషణం, గౌరయ్య, స్వప్న, సౌమ్య, అఖిల, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలి



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఏఈ, ట్రాఫిక్ సీఐ నాయకులు

చిక్కడపల్లి: పనులు త్వరగా పూర్తి చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అధికారులను ఆదేశించారు. జవహర్‌నగర్ స్కూల్ వద్ద కచ్చామోరీ పనులను ఏఈ సలాం, ట్రాఫిక్ సీఐ వీరేశంతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాహనదారులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సీఐ వీరేశంకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రెసిడెంట్ ఎం.రాకేశ్‌కుమార్, సీనియర్ నాయకులు ముఠానరేశ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, ఆకుల శ్రీనివాస్, పున్న సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, వెంకటేశ్, ఎస్టీ ప్రేమ్, కమ్మర్, సంతోష్, వంశీ, సుధాకర్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యమున్న విద్యార్థులదే భవిష్యత్తు



ఇంటర్వ్యూ చేస్తున్న ప్రతినిధి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వృత్తి నైపుణ్యం పెంచుకున్న విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని అంబేడ్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్ అన్నారు. అంబేడ్కర్ కళాశాలలో శనివారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ మార్కెటింగ్, గ్రాఫిక్ డిజైనర్, ఫీల్డ్ సేల్స్‌లో బీఏజెడ్ ప్లస్ ఫోర్‌యూ కంపెనీల ప్రతినిధులు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన



కాచిగూడ: బీజేపీ సభ్యత్వం తీసుకునేందుకు మహిళలు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేశ్ యాదవ్ అన్నారు. మహిళా మోర్చా కాచిగూడ డివిజన్ అధ్యక్షురాలు వల్లభ లావణ్య ఆధ్వర్యంలో శనివారం సభ్యత్వ నమోదు చేపట్టారు. మహిళా నేతలు బీ జ్యోతి, డీ సుజాత, కీర్తి, శాంతాబాయి, సారిక, వరలక్ష్మి, సి.కళావతి, తారా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మట్టికుప్పల తొలగింపు



బాగ్‌లింగంపల్లిలోని సోప్ ఫ్యాక్టరీ లేన్‌లో మట్టి కుప్పలు తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని సోప్ ఫ్యాక్టరీ మెయిన్ రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది శనివారం తొలగించారు. ఈ సందర్భంగా రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవిచారి మాట్లాడుతూ.. మట్టికుప్పల వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేయగా చర్యలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో బస్తీ నాయకులు సతీశ్, ఉపేందర్, ఉమామహేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



పార్శిగుట్టలో తొలగిస్తున్న సిబ్బంది

**పార్శిగుట్టలో ..**

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ పార్శిగుట్ట ప్రధాన రోడ్డు, గంగపుత్ర సంఘం శ్మశానవాటిక వద్ద కొన్ని రోజులుగా పేరుకుపోయిన మట్టికుప్పలు, చెత్తను జీహెచ్‌ఎంసీ సిబ్బంది శనివారం తొలగించారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఏఎంవోహెచ్ డాక్టర్ ప్రవీణ ఆదేశాలతో యంత్రాలతో మట్టిని తొలగించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు అపరిశుభ్రత వాతావరణం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, భాస్కర్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## సీఎం నిర్ణయంపై హర్షం



కవాడిగూడ: శ్రీలక్ష్మీనర్సింహాస్వామి కొలువుదీరిన నారసింహ క్షేత్రం యాదాద్రి పేరును యాదగిరిగుట్టగా వెంటనే మార్చుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. అనాధిగా యాదగిరి నర్సన్నగా పిలుచుకునే యాదగిరిగుట్టను మధ్యలో యాదాద్రిగా పేరు మార్చారని పేర్కొన్నారు. అలాగే యాదగిరిగుట్టలో భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## జాబ్‌మేళాకు విశేష స్పందన



కాచిగూడ: రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. తెలంగాణ యూజీ అండ్ పీజీ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ సహకారంతో నారాయణగూడలోని కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన మేళాకు 1000 మందికి పైగా యువత తరలివచ్చారు. దేశంలోని పేరొందిన 50కి పైగా వివిధ కంపెనీల ప్రతినిధులు అర్హత గల అభ్యర్థులను ఎంపిక చేశాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే అచ్యుతాదేవి మాట్లాడుతూ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారానే కెరీర్‌లో అత్యుత్తమ అవకాశాలు అందిపుచ్చుకునేందుకు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డీ సంయుక్త, ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ అలీముద్దీన్ పాల్గొన్నారు.

## జాప్యం లేకుండా ధ్రువీకరణ పత్రాల జారీ

అంబర్‌పేట: జాప్యం లేకుండా విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తున్నట్లు అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదాయం, కుల, ఓబీసీ వంటి ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు సరైన ఆధారాలు జత చేసి దరఖాస్తు చేసుకోవాలని, దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎలాంటి అపోహలు ఆందోళన చెందకుండా మీసేవా ద్వారా దరఖాస్తు చేసుకుని ధ్రువీకరణ పత్రాలు పొందాలని కోరారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తనను సంప్రదిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు.

## సర్వే సిబ్బందిపై దురుసు ప్రవర్తన

చిక్కడపల్లి: సమగ్ర కుటుంబ సర్వేకు వెళ్లిన ఓ ఎన్యూమారేటర్‌పై గాంధీనగర్ కెనరా బ్యాంక్ సమీపంలోని ఓ మహిళ దురుసుగా ప్రవర్తించింది. తమ వ్యక్తిగత వివరాలు ఎందుకు చెప్పాలంటూ వాదించడంతో పాటు దురుసుగా ప్రవర్తిచడంతో సిబ్బంది వెనుదిరిగారు. జరిగిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో వారి సూచన మేరకు స్థానిక పోలీసుస్టేషన్ ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు.

## పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. డివిజన్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట చేపట్టిన డ్రైనేజీ పైపులైన్ పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు, జలమండలి అధికారులు ఉన్నారు.

## రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి



కాచిగూడ: రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బుద్వేల్–ఉందానగర్ రైల్వేస్టేషన్ల మధ్య మహిళ (55) మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తలసీమియా బాధితుల కోసం రక్తదానం చేయాలి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తలసీమియా బాధితుల కోసం ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పైడి రాకేశ్ రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ సుచరిత రెడ్డి కోరారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు వద్ద ఉన్న జీజీచారిటీ 9స్టార్ హెల్త్‌కేర్ హాస్పిటల్‌లో రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ సహకారంతో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 40 మంది బ్లడ్ డొనేట్ చేశారు. ఈ సందర్భంగా సుచరిత రెడ్డి మాట్లాడుతూ.. రక్తమార్పిడికి నెలకు చాలా యూనిట్ల రక్తం అవసరం ఉంటుందని, ఎన్నో శిబిరాలు నిర్వహిస్తున్నా ఇంకా దాతల కొరత ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ఉద్యోగులు ముందుకు రావాలని కోరారు. అలాగే ఇటీవల తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ది పర్పుల్ పాప్ ఆఫ్ లో వచ్చిన లాభాలను పలు సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నాగరాజు, అధ్యక్షులు బాలకోటి రెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు అట్రాసిటీ చట్టం అవసరం

**బీసీ కమిషన్ చైర్మన్‌కు బీసీ సంక్షేమ సంఘం వినతి**

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీలకు కూడా అట్రాసిటీ చట్టం అవసరమని రాష్ట్ర బీసీ సంక్షేమ కార్యదర్శి జాజుల లింగంగౌడ్, ఎంబీసీ అధ్యక్షుడు బడేసాబ్ అన్నారు. శనివారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం అందచేసినట్లు తెలిపారు. ఇప్పుడిప్పుడే చైతన్యం అవుతున్న బీసీ కులాలను చూసి కొన్ని వర్గాలు ఓర్వలేక దాడులు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలలో కొన్ని కులాల వారిని కించపరిచేలా మాట్లాడుతున్నారని, వారి రక్షణకు ఏపీ తరహాలో బీసీ చట్టం తీసుకరావాలసిన అవసరం ఉందన్నారు. కుల వృత్తులు చేయనివారిని గ్రామ అభివృద్ధి కమిటీల పేరుతో గ్రామ బహిష్కరణ చేస్తున్నారని ధ్వజమెత్తారు. కొన్ని గ్రామాల్లో రజకులను బట్టలు ఉతకాలని, లేని పక్షంలో ఊరు విడిచి వెళ్లాలని గ్రామా అభివృద్ధి కమిటీలు హుకుం జారీ చేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఓ గ్రామంలో నాయిబ్రాహ్మణ(మంగళి) యువకుడు అగ్రవర్ణాలకు చెందిన అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకుంటే వారి ఇంటిని స్వాధీనం చేసుకొని ఊరు నుంచి తరిమివేశారని విచారం వ్యక్తం చేశారు. గ్రామాలలో కుమ్మరి, కమ్మరి, పద్మశాలి, వడ్డెర, చాకలి, మంగలి, పిచ్చకుంట్ల తదితర బీసీ కటుంబాలను చిన్నచూపు చూస్తున్నారని వివరించారు. ఇలా బీసీలపై వెలుగులోకి రాని అవమానాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని లింగంగౌడ్ వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న జనగణన ముగియక ముందే బీసీల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.



## గైనిక్ సమస్యల్ని నిర్లక్ష్యం చేస్తే కేన్సర్‌కు దారితీయొచ్చు

రాంగోపాల్‌పేట్: మహిళల పునరుత్పత్తి అంగాల లోపలిభాగంలో ఉండే చర్మంపై దురద, మంట వంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో కేన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మిషిగన్‌కు చెందిన డాక్టర్ హోప్ కేథరిన్ అన్నారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో వల్వ్యులర్ హెల్త్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాలకు చెందిన గైనకాలజిస్టులు, డెర్మటాలజిస్టులు, ఇతర వైద్యులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన డాక్టర్ రాజల్ సి పటేల్‌తో కలిసి ఆమె యువ డాక్టర్లకు అవగాహన కల్పించారు. చాలామంది మహిళలు ఇలాంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తుంటారని, సిగ్గు వల్ల వైద్యులకు చూపించడంలేదని అన్నారు. ఇంతకాలం యోని లోపలి భాగాలకు సంబంధించిన సమస్యలపై దృష్టి పెట్టామని, ఇప్పుడు పై భాగంలో ఉండే చర్మానికి వచ్చే సమస్యలపై కూడా దృష్టి సారించాలన్నారు. ఇవే కాకుండా మహిళల్లో గర్భసంచి కిందకు జారడం, మూత్రవిసర్జన, మల విసర్జనపై నియంత్రణ కోల్పోవడం లాంటి సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయని చెప్పారు. ఈ రంగంలో వస్తున్న సరికొత్త మార్పులు, వైద్య చికిత్సలపై అవగాహన పెంచుకోవాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి యూరో గైనకాలజి విభాగాధిపతి డాక్టర్ అనురాధ కోడూరి, లాప్రోస్కోపిక్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ నీనా దేశాయ్, ఉస్మానియా ఆస్పత్రి గైనకాలజీ విభాగధిపతి డాక్టర్ బాలాంబ తదితరులు పాల్గొని పలు సూచనలు, సలహాలు అందించారు.

## పుల్లారెడ్డికి ఘన నివాళి



ముషీరాబాద్: సీపీఐ (ఎంఎల్) న్యూ డెమాక్రసీ రెండు పార్టీల నగర కమిటీల ఆధ్వర్యంలో భారత విప్లవోద్యమ సారథి చంద్ర పుల్లారెడ్డి వర్ధంతిని విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో శనివారం నిర్వహించారు. పి.సూర్యం, సాధినేని వెంకటేశ్వరరావు, జేవీ చలపతిరావు, కె.గోవర్ధన్ హాజరై పుల్లారెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మావోయిస్టుల పోరాట స్ఫూర్తితో గోదావరి లోయ గిరిజన రైతాంగ ప్రతిఘటన పోరాటాన్ని పుల్లారెడ్డి ముందుకు తీసుకువచ్చారన్నారు. విప్లవోద్యమ నిర్మాణంతోనే ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతంలోని పేద ఆదివాసీ, గిరిజనులు 10 లక్షల ఎకరాల భూములను దక్కించుకుని ఉపాధి పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు అరుణ, అనురాధా, వీవోడబ్ల్యూయూ నాయకులు ఝాన్సీ, అనసూయ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పీ మహేశ్, ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, నవీన్, యశ్వంత్, శ్యామ్, మల్లికార్జున్, మనిమాల, రాజమణి పాల్గొన్నారు.